సాక్షి
కర్నూలు
బుధవారం । 25 । డిసెంబర్ । 2024



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద పథకానికి మంగళవారం నంద్యాలకు చెందిన ప్రభావతమ్మ రూ.1,00,116 విరాళాన్ని దేవస్థాన ఏఈవో జి.స్వాములుకు అందజేశారు.



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్న నందీశ్వరునికి, క్షేత్రపాలకుడు బయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,627.81
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 86.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 545
అవుట్ ఫ్లో	: 7,386

న్యూస్‌రీల్

సాంకేతిక ఏవోల డిప్యుటేషన్ గడువు పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ముగ్గురు సాంకేతిక వ్యవసాయ అధికారుల డిప్యుటేషన్‌ను మరో ఆరు నెలలు పొడిగిస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. సాంకేతిక ఏవోలు అల్లీపీర, అనురాధ, సునీతల డిప్యుటేషన్ గడువు ఈ నెల చివరితో ముగియనుంది. ఇటీవలనే వీరి డిప్యుటేషన్ గడువును పొడిగించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి లేఖ రాశారు. ఇందుకు అనుగుణంగా వచ్చే ఏడాది జూన్ నెల వరకు ఆరు నెలల పాటు ఆన్‌డ్యూటీని పొడిగించారు. కాగా నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సాంకేతిక ఏవోగా పనిచేస్తున్న హరిప్రియను ఆన్ డ్యూటీపై కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రానికి బదిలీ చేశారు.

దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్, డీజిల్

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఏదేని సొంతంగా వ్యాపారం చేస్తున్న లేదా గుర్తింపు కలిగిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ సొంతంగా మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనం కలిగిన దివ్యాంగులు పెట్రోల్/ డీజిల్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు ఫారం, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు (బియ్యం కార్డు), బ్యాంకు పాసు పుస్తకం (మొదటి పేజీ), ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదేని సంస్థలో పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందించాలని, మరిన్ని వివరాలకు కార్యాలయ ఫోన్ నెంబర్: 08518-277864లో సంప్రదించాలన్నారు.

28న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 28వ తేదీన జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు స్థానిక మినీ సమావేశ భవనంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పనులు, ఆర్థిక ప్రణాళిక తదితర శాఖలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వివిధ శాఖలకు చెందిన అధికారులు తమకు కేటాయించిన నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

ప్రేమ, కరుణ చూపాలి

కర్నూలు(సెంట్రల్): సాటి మనుషులపై ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువులపై క్షమ చూపాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమలు శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. జిల్లాలోని క్రిస్టియన్ ప్రజలు క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, వారికి అన్నివేళల ఏసుప్రభువు అనుగ్రహం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రానున్న సంవత్సరంలో అన్ని శుభాలు కలగాలని, అందుకోసం అందరికీ ప్రభువు దీవెనలు ఇవ్వాలని కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే జిల్లా ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ జిల్లా ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించారు.



☛ కర్నూలు నగరానికి 15 కి.మీ. దూరంలో ఉన్న పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఇప్పటి వరకు మొదలు కాలేదు. పది విద్యార్థుల ఉత్తీర్ణత పెంచేందుకు విద్యాశాఖ ఈ నెల 3వ తేదీన ప్రణాళికను విడుదల చేసింది. కానీ ఇక్కడ అసలు తరగతులే ప్రారంభం కాలేదంటే ఉన్నత పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమవుతోంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లోని స్కూళ్లలో పర్యవేక్షణ ఇక దేవుడెరుగు.



☛ మండల కేంద్రం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 1,850 మంది విద్యార్థులు చదువుతున్నారు. 10వ తరగతిలో ఇంగ్లిషు మీడియంలో 216 మంది, కన్నడ మీడియంలో 55, ఉర్దూ మీడియంలో 11 మంది మొత్తం 282 విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ 56 మంది టీచర్లు పని చేయాల్సి ఉండగా, కేవలం 38 మందే ప్రస్తుతం ఉన్నారు. తెలుగు సబ్జెక్టుకు ఏడుగురు గాను నలుగురు, హిందీకి ముగ్గురు టీచర్లకు ఇద్దరు ఉండగా, వీరిలో ఒకరు సెలవుల్లో ఉన్నారు. ఉర్దూ టీచర్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ టీచర్లే లేరు. దీంతో కొన్ని సబ్జెక్టులలో సిలబస్ ఇంకా పూర్తి కాలేదు.

పదింతల నిర్లక్ష్యం

- పదో తరగతి ఫలితాల పెంపునకు వంద రోజుల ప్రణాళిక
- క్షేత్ర స్థాయి అమలులో కొరవడిన పర్యవేక్షణ
- వెనుకబడిన విద్యార్థులపై లోపించిన ప్రత్యేక దృష్టి
- కేజీబీవీల్లో పత్తాలేని పంచతంత్ర.. ఆదర్శ పాఠశాలల్లో అడిగే దిక్కేలేదు
- జిల్లా వ్యాప్తంగా నామమాత్రంగా ప్రత్యేక తరగతులు



కోడుమూరు మండలం అమడగుండ్ల హైస్కూల్‌లో ఆవరణలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

జిల్లాలో ఉన్నత పాఠశాలలు	- 507
పదో తరగతి విద్యార్థులు	- 38,448
ఏ - కేటగిరిలో	- 8,295
బీ - కేటగిరిలో	- 10,646
సీ - కేటగిరిలో	- 8,645
డీ - కేటగిరిలో	- 5,398

కర్నూలు సిటీ: విద్యార్థి జీవితంలో పదో తరగతి మొదటి మెట్టు. ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలంటే ఇక్కడ తప్పనిసరిగా గట్టెక్కాల్సిందే. ఈ నేపథ్యంలో అధికారులు పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది. 2025 మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. ఈ క్రమంలో పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇటీవలే విద్యాశాఖ 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులు, రోజుకొక సబ్జెక్టు ప్రకారం రివిజన్, విద్యార్థులకు స్లిప్ టెస్ట్ నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. కానీ జిల్లాలో చాలా చోట్ల ప్రత్యేక తరగతులు నిర్వహించడం లేదు. డీఈఓ రెగ్యులర్‌గా విద్యాశాఖకు సంబంధించిన సమీక్షలు, కాన్ఫరెన్స్‌లతోనే కాలం వెల్లదీస్తున్నారు. ఇక డిప్యూటీ డీఈఓలు మాత్రం ఎక్కడ పర్యవేక్షిస్తున్నారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన హైస్కూళ్లకు చెందిన 38,448 మంది విద్యార్థులు ఫార్మెటివ్ 1,2 (ఎఫ్ఏ), సమ్మెటివ్ (ఎస్ఏ) అసెస్మెంట్ పరీక్షలు రాశారు. ఆ పరీక్షల ఫలితాలను బట్టి చదువులో వెనుకబడిన విద్యార్థులను నాలుగు కేటగిరిలుగా విభజించారు. ఏ- క్యాటగిరిలో 8295, బీ - క్యాటగిరిలో 10,646, సీ - కేటగిరిలో 8,645, డీ- కేటగిరిలో 5,398 మంది విద్యార్థులు ఉన్నారు. ఎక్కువ శాతం మంది గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లోనే ఫెయిల్ అవుతున్నారు. ఆయా సబ్జెక్టులలో టీచర్ల కొరత అధికంగా ఉండటమే ఇందుక కారణం. ఆయా సబ్జెక్టు టీచర్లతో సీ, డీ కేటగిరిలకు చెందిన విద్యార్థులపై ఎక్కడ కూడా ప్రత్యేక దృష్టి సారించలేదు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

పశ్చిమ ప్రాంతానికి చెందిన హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యామ్నాయంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు చాలా రోజులుగా కోరుతున్నాయి. కానీ ప్రభుత్వం నుంచి అయితే ఇంత వరకు ఆవైపుగా ఆలోచనలు చేయలేదు. విద్యాశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 854 సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. గత ప్రభుత్వం జిల్లాలో 1,876 సబ్జెక్టు టీచర్లను భర్తీ చేసింది. మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించి వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. మెగా డీఎస్సీ నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం దగా చేసింది. దీనికి తోడు పశ్చిమ పల్లెల్లో వలస పోవడంతో చాలా మంది స్కూళ్లకు హాజరు కావడం లేదు. తల్లిదండ్రులతో పాటు పిల్లలు వెళ్లకుండా విద్యాశాఖ ముందస్తుగా చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ మంది పదో తరగతి పిల్లలు వలస వెళ్లినట్లు తెలుస్తోంది.

సిలబస్ ఇంకా మిగిలే ఉంది..

ఈ విద్యా సంవత్సరంలో మొదటిసారి పదో తరగతి విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో పరీక్షలు రాయనున్నారు. గత ప్రభుత్వం జిల్లాలో 90 స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్ అమలులో ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ సిలబస్‌ను రద్దు చేయడంతో ఆ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు కొంత గందరగోళానికి గురయ్యారు. ఈ నెల 15వ తేదీలోపు అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి కావాలి. కానీ ఇంత వరకు సిలబస్ పూర్తి కాలేదు. కానీ ఎంత సిలబస్ పూర్తి చేశారు..ఇంకెంత కావాల్సి ఉంది అనే విషయంపై సమీక్షించే వారే కరువయ్యారు. ఏపీ మోడల్ స్కూళ్లలో అయితే ఏమి జరుగుతుందో అడిగే దిక్కు లేకుండా పోయింది. ఆ స్కూళ్ల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. గతంలో ఆ స్కూళ్ల పర్యవేక్షణకు ఏడీ ఉండేవారు. అయితే ఇప్పుడు ఉన్నారో లేదో కూడా తెలియని పరిస్థితి. అదే విధంగా కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో పది ఫలితాల పెంపునకు గతేడాది నుంచి పంచతంత్ర అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చినా అమలు కావడం లేదు. స్థానికంగానే ఉండాల్సిన ఎస్ఓలు సాయంత్రానికే ఇళ్లకు బయలుదేరుతున్నారు. కనీసం ఇప్పటికైన జిల్లా విద్యాశాఖ అధికారులు మేల్కొకపోతే ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

ప్రారంభం కాని వర్చువల్ ల్యాబ్



వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వర్చువల్ ల్యాబ్ నుంచి తరగతులు నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ముందుగా డీఈఓ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. అయితే అక్కడ పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో నగరంలోని సంకల్ బాగ్ మున్సిపల్ పాఠశాలను పరిశీలించారు. చిన్న చిన్న మరమ్మతులు ఉన్నాయంటూ చెబుతూనే రోజులు గడుపుతున్నారు. వెనుకబడిన విద్యార్థులు కనీస పాస్ మార్కులతోనైన ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్, ప్రశ్నపత్రాల నమూనాలను ఇప్పటి వరకు అందించ లేదు.

ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తాం



పదిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు వంద రోజుల ప్రణాళిక తయారు చేసి అన్ని హైస్కూళ్లలో అమలు చేసేలా ఇటీవలే కలెక్టర్ రంజిత్ బాషా ప్రధానోపాధ్యాయులకు చాలా విలువైన సూచనలు చేశారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి టీచర్ల కొరత ఉన్న చోట డిజిటల్ ల్యాబ్ ద్వారా బోధనకు ఏర్పాటు చేశాం. పరీక్షలు ముగిసే వరకు కచ్చితంగా ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చాం.

– ఎస్.శామ్యూల్ పాల్, డీఈఓ

కరెంట్ చార్జీల బాదుడుపై పోరాటం

- పేదల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం
- ఆరునెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీల పెంపు
- ఈ నెల 27న నిరసన కార్యక్రమాలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: 'ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు భారీగా ప్రజలపై విద్యుత్ భారం వేస్తున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజలతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరాటానికి దిగుతోంద'ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కాటసాని కల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. దీనిపై ఈ నెల 27న పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆరోజు ప్రజలతో కలసి విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతి పత్ర మిస్తామన్నారు. కూటమి పాలనలో విద్యుత్ భారం ఎక్కువైందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేయడం లేదని మండిపడ్డారు.

15వేల కోట్ల ప్రజలపై భారం

ఆరు నెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల ప్రజలపై రూ. 15వేల కోట్లు భారం పడుతుందని కాటసాని అన్నారు. ఎన్నికలకు ముందు ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని చెప్పారన్నారు. అంతేకాకుండా సోలార్, విండ్ పవర్ తీసుకువచ్చి వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానంటూ ప్రగల్భాలు పలికారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకపోగా రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరోమాట చెబుతారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబే చార్జీలు భారీగా పెంచుకుంటూపోతున్నారని చెప్పారు. నాడు అసత్య ప్రచారం చేసిన ఎల్లో మీడియా ఇప్పుడు కరెంట్ బాదుడుపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం కరెంట్‌చార్జీల పెంపుపై ఈనెల 27న వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించి ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీశ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ నవ్య

కర్నూలు సిటీ: వినియోగదారులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని..ఇందుకోసం ఓ చట్టం ఉందని జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య పేర్కొన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ పాల్గొని ప్రసంగించారు. 1986 సంవత్సరంలో మొదటగా వినియోగదారుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబరు 24వ తేదీన జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. రోడ్లపై ఆకర్షణీయంగా కనిపించే ఆహారపదార్థాలు తినడం ద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ మధ్య సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ సాయిగోపాల్, వినియోగదారుల సంఘం సభ్యులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజారఘువీర్, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, జిల్లాపౌర సరఫరాల శాఖ డీఎం సంధ్యారాణి, ఆర్టీఓ లాల్ సింగ్ చౌహాన్, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, ఎల్‌డీఎం రామచంద్రారావు, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఔషధ నియంత్రణ అధికారి రమాదేవి, వినియోగదారుల సంఘం కార్యదర్శి శివ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన పంట ఉత్పత్తుల ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు తగ్గుముఖం పట్టాయి. కందులకు కనీస మద్దతు ధర రూ.7,550 ఉండగా.. మార్కెట్‌లో లభిస్తున్న ధర కేవలం రూ.6,696 ఉంటోంది. కందులు మార్కెట్‌కు రావడం రోజురోజుకు పెరుగుతోంది. వేరుశనగ ధర మరింత పడిపోయింది. కనిష్ఠంగా రూ.3,726, గరిష్ఠ ధర రూ.5,600 లభించింది. వాముకు కేవలం రూ.5,599 మాత్రమే పలికింది. ఉల్లి కనిష్ఠ ధర రూ.1,400,గరిష్ఠ ధర రూ.3,038 లభించింది.సగటు ధర రూ.2,729గా నమోదైంది.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల రిజర్వేషన్లకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల రిజర్వేషన్లపై మార్కెటింగ్ శాఖ దృష్టి సారించింది. జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, మంత్రాలయం మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో మూడింటికి రిజర్వేషన్ కల్పించనున్నారు. మూడింటిలో ఒకటి ఎస్సీలకు, రెండు బీసీలకు కేటాయిస్తారు. రెంటింటిలో ఒకటి బీసీ జనరల్, మరొకటి మైనార్టీలకు నిర్ణయించారు. ఓసీలకు 4 మార్కెట్ కమిటీలకు కేటాయించారు. ఇందులో 2 మహిళలకు, మరో రెండు జనరల్ చేయనున్నారు. రిజర్వేషన్లకు సంబంధించిన ఫైల్‌ను మార్కెటింగ్ శాఖ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌కు పంపింది. మంత్రి ఆమోదం పొందిన తర్వాత ఫైల్‌ను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత రిజర్వేషన్ల వివరాలను ప్రకటించడం జరుగుతుందని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.



కర్నూలు నగరంలో విద్యుత్ కాంతులతో బిషప్ చర్చి

మరియ సుతుడి మహోదయం నేడే

ఏసు జననం.. మహోదయం. సర్వ లోకానికి కరుణోదయం. మరియ పుత్రుడు భువికేతించే క్షణం కోసం హృదయానందంతో జనులు జేజేలు కొడుతున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని నిర్వహించుకునేందుకు జిల్లాలోని క్రైస్తవ లోకం సిద్ధమైంది. మెర్రీ మెర్రీ క్రిస్మస్.. హ్యాపీ హ్యాపీ క్రిస్మస్... అంటూ క్రిస్మస్‌కు స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. 'పాక లోన ఏసు జననంతో సందడాయే.. లోకమంతా పండుగాయే' అంటూ ప్రత్యేక గీతాలాపనలు హోరెత్తాయి. బాల ఏసు పుట్టుకను వివరించేలా ప్రార్థనా మందిరాలను అత్యద్భుతంగా అలంకరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు ప్రాంతాల్లో క్రిస్మస్ శుభ సందేశాన్ని దైవ సందేశం రూపంలో బుధవారం పాస్టర్లు, ఫాదర్లు చర్చిల్లో వినిపించనున్నారు. క్రీస్తు బోధనలు గుర్తు చేసుకుంటూ తమ పాపాలను ప్రక్షాళన చేసి దైవ మార్గంలో నడిపించమని వేడుకోనున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకొని పేదలకు అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఏసు జననం వృత్తాంతం వివరించేలా..

– కర్నూలు కల్చరల్

సంతలో పొట్టేళ్లు అ'ధర'హో!



ప్రజలతో కిక్కిరిసిన సంత మార్కెట్



కొమ్ములు తిరిగిన కర్ణాటక పొట్టేళ్లు

కోసిగి: గ్రామీణ ప్రాంతాల్లో దేవరలు జరుగుతుండటంతో పొట్టేళ్లకు డిమాండ్ ఏర్పడింది. మండలంలోని నేడు వందగల్లు, గౌడుగల్లు, జుమ్మాలదిన్నె, దుద్ది, కొల్మాన్‌పేట, సాతనూరు, అగసనూరు, చింతకుంట, పెద్దకడబూరు మండలం బాపుల దొడ్డి గ్రామాల్లో గ్రామ దేవతల మారెమ్మ దేవర ఉత్సవాలు జరుగనున్నాయి. అలాగే జనవరి 6, 7వ తేదీలో నిర్వహించే కోసిగి దేవరకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో అందరూ పొట్టేళ్ల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. దీంతో చుట్టూ పక్కల ఎక్కడ సంత జరిగినా పొట్టేళ్లు అధిక ధర పలుకుతున్నాయి. మంగళవారం మండల కేంద్రం కోసిగిలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గొర్రె పొట్టేల వారపు సంత మార్కెట్ వ్యాపారస్తులు, ప్రజలతో కిక్కిరిసి పోయింది. ఒక్కో పొట్టేలు రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు పలికింది. ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట ఆమనిగడ్డ ప్రాంతాల నుంచి పొట్టేలను సంత మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. పందెం పొట్టేళ్లు కూడా సంతకు రావడంతో అధిక ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల మూడు పొటేళ్లు రూ. లక్షకు పైగా ధర పలకడం విశేషం.

క్లుప్తంగా

పాలిష్ కటింగ్ మిషన్ ప్రమాదంలో గాయాలు

కోవెలకుంట్ల: పట్టణంలో నాపరాతి పాలిష్ కటింగ్ మిషన్ ప్రమాదంలో మంగళవారం ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల మండలం కానాలకు చెందిన సత్యం కోవెలకుంట్ల పట్టణంలోని పాలిష్ కటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాపరాతి కటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదశాత్తూ మిషన్ కింద పడి చేయి కట్ అయింది. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా నంద్యాలకు తరలించారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు

జిల్లా క్రీడాకారుల ఎంపిక



జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రుద్ర రెడ్డి మంగళవారం స్టేడియంలో అభినందించారు. ఈనెల 26 నుంచి 29 వరకు కేరళ రాష్ట్రంలోని కొట్టాయంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన జగదీష్ (బనగానపల్లె), షేక్షావలి, శివ (కర్నూలు) పాల్గొంటారన్నారు.

పోగొట్టుకున్న డబ్బు బాధితురాలికి అప్పగింత

కర్నూలు (టౌన్): నగరంలోని బుధవారపేటకు చెందిన నస్రీనా సుల్తానా ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో సంప్రదించింది. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదుకు చెందిన అనిల్ యాదవ్ ఆమెను సంప్రదించాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి బాధితురాలి వద్ద రూ.1.25 లక్షలు ఆన్‌లైన్ ద్వారా వసూలు చేశాడు. ఎన్ని సార్లు సంప్రదించినా అందుబాటులోకి రాకపోవడంతో సైబర్ నేరానికి గురయ్యానని గుర్తించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ మూడవ పట్టణ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికతను ఉపయోగించి డబ్బు రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితురాలికి అందజేశారు

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని నూనెపల్లె సర్కిల్‌లో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ సూర్యమౌళి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ నూనెపల్లెకు చెందిన షేక్ జమాల్‌బాషా, బొగ్గు నాగేంద్రుడు మట్కా రాస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. సమాచారం మేరకు ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ క్రమంలో ఇద్దరు మట్కా బీటర్ల నుంచి మట్కా చీటీలతో పాటు రూ.1,02,070 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

● బంతీ..చామంతీ.. ముద్దాడుకున్నాయిలే..!

పూలంటే ఇష్టం లేని వారు ఉండరు. అలాంటిది బంతి, చామంతి పూలంటే మరీ ఇష్టం. అవే పూలు వివిధ రంగుల్లో ఉండి కనువిందు చేస్తే ఇక వారి ఆనందానికి హద్దే ఉండదు. ఇలాంటి ఫొటోలను చూసే కాబోలు ఓ సినీ రచయిత బంతీ.. చామంతీ ముద్దాడుకున్నాయిలే అంటూ చరణం కట్టినట్లున్నారు. బేతంచెర్ల నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో దాదాపు రెండు కిలోమీటర్ల వరకు పూల తోటలు ప్రయాణికులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. సీతారామాపురం, శంకలాపురం, బైనపల్లె, యంబాయి, మండ్లవానిపల్లె, రుద్రవరం, ముద్దవరం, వీరాయపల్లె గ్రామాల రైతులు బోరుబావుల కింద బంతి, చేమంతి పూలు సాగు చేశారు. సుమారు 300 ఎకరాల్లో సాగు చేసిన చేమంతి, బంతి పూల తోటలు కోత దశకు వచ్చాయి. కర్నూలు ప్రధాన రహదారి వెంట రాకపోకలు సాగించే ప్రయాణికులకు కొత్త ప్రాంతానికి వచ్చామా అనే అనుభూతిని కలిగిస్తున్నాయి. – బేతంచెర్ల



కోలుకోలేక దంపతుల మృతి



సరస్వతి, సుబ్బరాయుడు దంపతులు

బొమ్మలసత్రం: హిజ్రాల చర్యలతో ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు కోలుకోలేక మంగళవారం మృతిచెందారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీకి చెందిన సుబ్బరాయుడు(43), సరస్వతి(37) దంపతుల కుమారుడు సునీల్ బీటెక్ మొదటి సంవత్సరం ఫెయిలై ఆటో డ్రైవర్ల జత కట్టాడు. ఈనేపథ్యంలో హిజ్రాలతో తిరుగుతూ ఓ హిజ్రాతో ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సునీల్‌ను తీసుకొచ్చి బంధువుల వద్దకు పంపారు. అప్పటి నుంచి హిజ్రాల బృందం సుబ్బరాయుడు దంపతులు నడుపుతున్న దుకాణం వద్దకు వచ్చి వికృత చేష్టలతో వేధించడం, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినా కోలుకోలేక దంపతులిద్దరూ మృతి చెందారు.

అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు

కోడుమూరు రూరల్: స్థానిక కేవీఆర్ జూనియర్ కళాశాల కంప్యూటర్ లెక్చరర్ భాస్కర్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు తెలిపిన వివరాలు.. ఈనె 23న ఓ విద్యార్థిని పట్ల లెక్చరర్ భాస్కర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఇదే విషయాన్ని విద్యార్థిని తోటి స్నేహితులకు చెప్పడంతో వారు విద్యార్థి సంఘాల నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, వీరేంద్ర, మురిస్వామి, సిద్దు తదితరులు మంగళవారం కళాశాల వద్దకు చేరుకుని లెక్చరర్‌ను విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులును కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ శ్రీనివాసులు కళాశాల వద్దకు వెళ్లి సిబ్బందిని, విద్యార్థులను విచారించి లెక్చరర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.



లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

యువకుడి దుర్మరణం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గురుకుల పాఠశాల వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యు.కొత్తపల్లె గ్రామానికి చెందిన రమీజ్‌రాజా(35) దుర్మరణం చెందగా అదే గ్రామానికి చెందిన అలీబాషాకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్‌లోని ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేసే రమీజ్‌రాజా సోమవారం రాత్రి స్నేహితుడు(దగ్గరి బంధువు) అలీబాషాతో కలిసి వ్యక్తి గత పనుల నిమ్మితం బైకుపై డోన్‌కు వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. ఘటనా స్థలం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన నిర్మాణం కోసం తీసిన గుంతలో పడిపోవడంతో రమీజ్‌రాజా, అలీబాషా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటే క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే రమీజ్‌రాజా మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అలీబాషాను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు వైద్యశాలకు తరలించారు. కాగా మృతుడికి భార్య మమతతోపాటు కూతురు, కుమారుడు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదం స్థలంలో తీవ్ర గాయాలతో రమీజ్‌రాజా

సెంట్రల్ లైటింగ్ నిధులపై రచ్చ

● వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వాదం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శివ సర్కిల్ నుంచి గోనెగండ్ల బైపాస్ వరకు మంజూరైన నిధులపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వాదంతో కౌన్సిల్ సమావేశం రచ్చరచ్చగా సాగింది. మంగళవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. పట్టణంలో శివ సర్కిల్ నుంచి గోనెగండ్ల బైపాస్ రోడ్డు వరకు తమ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.40 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులతోపాటు ఏఐఐబీ స్కీం కింద రూ.142 కోట్లతో తాగునీటి పథకం పనులు జరుగుతున్నాయని టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ అనడంతో వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ సెంట్రల్ లైటింగ్‌కు ఏ నిధులు మంజూరు చేయించారో చెప్పాలని ప్రశ్నించారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలతో సభ గందరగోళంగా మారింది. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో పట్టణంలో అభివృద్ధికి పాటుపడ్డారని ఇందులో భాగంగానే మున్సిపల్ సాధారణ నిధులు రూ.40 లక్షలతో సెంట్రల్ లైటింగ్‌కు కేటాయించినట్లు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసిన విషయాన్ని వైస్ చైర్మన్ గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాడు ఏఐఐబీ కింద నిధులు మంజూరు చేయించి ఉంటే పనులెందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆ స్కీంకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభింపజేశారని అందుకు సాక్ష్యంగా తన సెల్‌లో ఉన్న ఫొటోలు, మీడియా క్లిప్పింగ్‌లు చూడాలంటూ కోరారు. దీంతో సభ్యుల వాగ్వాదంతో జఠిలం కావడంతో సమావేశాన్ని ముగించి చైర్మన్ వెళ్లిపోయారు. అనంతరం ఎజెండాలోని 37 అంశాలతోపాటు టేబుల్ ఎజెండాను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ డీఈలు, ఏఈలు, మేనేజర్ పాల్గొన్నారు.



కౌన్సిల్ సభ్యులను వారిస్తున్న మున్సిపల్ చైర్మన్,కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

కౌన్సిల్ హాల్ ముందు పోలీసుల పహారా

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా ఎన్నడూలేని విధంగా కౌన్సిల్ హాల్ ముందు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కాగా అనుమతి లేకుండా రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ ఎస్‌బీ కానిస్టేబుల్ ఏకంగా కౌన్సిల్ హాల్‌లో తిష్టవేసి సమావేశాన్ని గమనిస్తుండటాన్ని గుర్తించిన కొందరు కౌన్సిల్ సభ్యులు చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌బీ కానిస్టేబుల్‌ను కౌన్సిల్ సమావేశంలో కూర్చునేందుకు తాను అనుమతి ఇవ్వలేదని చైర్మన్ వారికి తెలిపారు. ఎస్‌బీ కానిస్టేబుల్ సమావేశ మందిరంలో కూర్చునే నిబంధన లేదని కమిషనర్ గంగిరెడ్డి సైతం తెలిపారు. మరి కానిస్టేబుల్ కౌన్సిల్ మీట్‌పై నిఘా ఉంచడంపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలేమైనా ఉన్నాయేమో అని సభ్యులు గుసగుసలాడటం గమనార్హం.



కౌన్సిల్ హాల్ ముందు పోలీసుల పహారా

కోర్టు భవన నిర్మాణం పూర్తి చేయండి



నూతన కోర్టు భవనాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది

ఆదోని రూరల్: నూతన కోర్టు భవన నిర్మాణం వచ్చే ఏడాది ఆగస్టులోగా పూర్తి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది సూచించారు. మంగళవారం ఆదోనిలో పర్యటించి, కోర్టు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సబ్‌జైల్‌ను పరిశీలించి ఖైదీలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఖైదీలను మాట్లాడడానికి వచ్చే బంధువుల వివరాలను, వారి హాజరు పట్టికను పరిశీలించారు. ఖైదీలకు ఇబ్బందులు వస్తే మండల న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్‌ను పరిశీలించారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుందర్‌సింగ్ తీసుకొచ్చారు. కోర్టులో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీనియర్ న్యాయవాది వై.ఆర్.మల్లికార్జున కోరారు. భవన నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతూ ఉండడంతో న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి మరో సీనియర్ న్యాయవాది విశ్వనాథ్‌రెడ్డి తీసుకొచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంట సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, న్యాయవాదులు హుసేన్‌సాని, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జనార్దన్, తాయన్న, ఇస్మాయిల్, శభాష్, మధు, వీరభద్రగౌడ్, వెంకటేష్, రంగన్న ఉన్నారు.



కానుగ ఆకుపై ఏసయ్య

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన బండి మధుకృష్ణ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని కానుగ ఆకుపై ఏసుక్రీస్తు చిత్రాన్ని గీశాడు. ఏసుక్రీస్తు బోధనలు ఆచరించడం ద్వారా తోటివారి పట్ల ప్రేమ, దయ, శాంతి, సౌభ్రాతృత్వాన్ని కలిగి ఉండవచ్చని మధుకృష్ణ తెలిపారు.

బీసీల పక్షపాతి అంబేడ్కర్

● మాజీ డీజీపీ, బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డా.జే పూర్ణచంద్రరావు
● అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కేవలం ఎస్సీల గురించి మాత్రమే మాట్లాడలేదని, ఆయన బీసీల పక్షపాతి అని మాజీ డీజీపీ, బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఏపీ సమన్వయకర్త డాక్టర్ జే పూర్ణచంద్రరావు అన్నారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్ గురించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశంలో ఐక్యత, సోదరభావాన్ని సర్వ నాశనం చేసిన బీజేపీ పాలనలో అంబేడ్కర్ వంటి యుగపురుషులను గౌరవిస్తారని అనుకోవడం పొరపాటేనని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ పట్ల అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. ఈ సంఘటన పట్ల ఇప్పటి వరకు అమిత్‌షా కానీ, బీజేపీ కానీ క్షమాపణలు చెప్పకపోగా, కనీసం పాశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా, అహంభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా, నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అంబేడ్కర్ పట్ల ఉన్న ద్వేషాన్ని, ఉక్రోషాన్ని బీజేపీ మరోసారి నిరూపించుకుందన్నారు. గతంలో కాంగ్రెస్ కూడా ఇదే ఈర్ష్యాభావంతో అంబేడ్కర్‌ను అవమానించిందన్నారు. అంబేడ్కర్ కేవలం ఎస్సీల కోసం కాదని, పీడిత వర్గాలందరి గురించి తపన పడ్డారన్నారు. బీసీ, మహిళల పక్షపాతిగా చట్టసభల్లో ఆయా వర్గాలకు రిజర్వేషన్లు ఉండాలని చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రధాన కులాలకు చెందిన వారు ఎంతగా అణచివేస్తున్నా, అంబేడ్కర్ ఇచ్చిన బలంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ధైర్యంగా నిలబడుగుతున్నారన్నారు. అంబేడ్కర్ గురించి హేళనగా మాట్లాడిన అమిత్‌షా వెంటనే తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పేంతవరకు బీఎస్పీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జయరాజ్, నేతలు అరుణ్‌కుమార్, సాదిక్‌బాషాతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నేతలు

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల– డబ్బ్యూ గోవిందిన్నె ఆర్‌అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు కూలీలు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. మండలంలోని రేవనూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు దొర్నిపాడు మండలం చాకరాజువేములకు చెందిన రైతు పొలంలో సీడుపత్తి పనులకు ఆటోలో వెళ్లారు. పను లు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న నాపరాతి రాళ్ల లోడ్ ట్రాక్టర్‌ను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో గ్రామానికి చెందిన నాగమ్మ, రసూలు తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తోటి కూలీలు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పూల మొక్కలతో వేడుకలు జరుపుకుందాం

● రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్

గోస్పాడు: రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన 'జనవరి వేడుకలను పూల మొక్కలతో జరుపుకుందాం' బ్యానర్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆవిష్కరించారు. జనవరి శుభాకాంక్షలు తెలియజేయడానికి తన అభిమానులు,కార్యకర్తలు శ్రేయోభిలాషులుస్వీట్స్, పూలదండలు, బొకేలు కాకుండా పూల మొ క్కలతో,నోటు పుస్తకాలతో శుభాకాంక్షలు తెలియజేయాలని మంత్రి ఫరూక్ మంగళవారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని,జనవరి 1న ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

26 నుంచి విద్యుత్ అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని తిప్పాయిపల్లి, శకునాల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వ్యవసాయానికి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. సోమయాజులు పల్లె నుంచి గని ఏపీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లోకి వచ్చే 220 కేవీ లైన్ కండక్టర్ మార్పు పనులు జరుగుతున్నందున ఈనెల 26 నుంచి జనవరి 1వ తేదీ వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు, పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు.

యాస్పిరేషన్ బ్లాకుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్‌పి.రంజిత్‌బాషా/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని యాస్పిరేషనల్ బ్లాకుల కింద గుర్తించిన చిప్పగిరి, హొళగుంద, మద్దికెర మండలాల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయా బ్లాకుల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం యాస్పిరేషన్ బ్లాకు మండలాలు హొళగుంద, మద్దికెర, చిప్పగిరిలలో జరుగుతున్న అభివృద్ధిపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాస్పిరేషన్ బ్లాకుల్లో మద్దికెరకు 18వ ర్యాంకు, హొళగుందకు 169, చిప్పగిరికి 321వ ర్యాంకు వచ్చినట్లు చెప్పారు. యాస్పిరేషన్ బ్లాకుల లో జల జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పించాలని సూచించారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ద్వారా గ్రామ పంచాయతీలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించాలని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు వ్యాధులు సంభవించకుండా టీకాలు వేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, గర్భిణులకు రక్త, షుగర్, టీబీ పరీక్షలు నిర్వహించి ఎన్‌సీడీ పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి ఇన్‌చార్జ్ సీపీఓ భారతి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డీఈఓ శామ్యూల్‌పాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు పాల్గొన్నారు.